

కమనీయం చెన్నకేశవుని కళ్యాణం

మార్కాపురం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కళ్యాణాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.

- 8లో..



ప్రజాబలంతోనే ఒంటరిగా పోటీ

సంక్షేమ పథకాలే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బలం అని, అందుకే ఒంటరిగా పోటీ చేస్తున్నారని దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
42/27

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేరుగు నామినేషన్ నేడు

- నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి భారీగా పార్టీ శ్రేణులు చీమకుర్తికి తరలిరావాలని పిలుపు



మేరుగు నాగార్జున, ఎస్‌ఎన్‌పాడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

చీమకుర్తి: సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున బుధవారం అధికారకంగా నామినేషన్ దాఖలు చేయనున్నారని వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి మంగళవారం తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు చీమకుర్తికి తరలిరావాలని ఇప్పటికే మంత్రి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేరుగు నాగార్జునకు మద్దతుగా ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, దర్శి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని క్రిష్టిపాటి శేఖరరెడ్డి తెలిపారు. చీమకుర్తిలోని బూచేపల్లి ఇంజినీరింగ్ కాలేజీ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా నామినేషన్‌లు వేసే నూతన మున్సిపల్ కార్యాలయం వద్దకు ర్యాలీ నిర్వహించిన అనంతరం మేరుగు నాగార్జున తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తారని తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ మండలాల కన్వీనర్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్‌లు, కార్పొరేటర్లు, పార్టీలోని పలు హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు హాజరై ర్యాలీని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

టీడీపీ జమానాలో సొంత ఆర్థిక ప్రయోజనాలే పరమావధిగా వ్యవహరించిన చంద్రబాబు సహకార రంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీశారు. సొంత డెయిరీ హెరిటేజ్ కోసం ఒంగోలు డెయిరీ ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టారు. చిత్తూరు డెయిరీని చిదిమేసినట్టుగానే.. ఒంగోలు డెయిరీ నిర్వహణను ప్రశ్నార్థకం చేసి జిల్లాలోని పాడిరైతుల నోట్లో మట్టికొట్టారు. కోఆపరేటివ్ సొసైటీలో ఉన్న డెయిరీని రైతులు, ఉద్యోగుల అభిప్రాయంతో సంబంధం లేకుండా నాటి పాలక మండలి చైర్మన్ చల్లా శ్రీనివాసరావు ఏకపక్షంగా కంపెనీ యాక్టులోకి మార్చడం చంద్రబాబు కుట్రలో భాగమేనన్నది సుస్పష్టం. జిల్లాలో డెయిరీనే కాదు.. పీడీసీసీబీ, డీసీఎంఎస్‌లనూ టీడీపీ నేతలు పీకల్లోతు అప్పుల్లో ముంచారు. ఆనాడు చంద్రబాబు సాగించిన విధ్వంసానికి 'ఆహా.. ఓహో' అంటూ వీరతాళ్లు వేసిన ఈనాడు.. డెయిరీని ముంచేశారంటూ సీఎం వైఎస్ జగన్‌పై విద్వేషం వెళ్లగక్కింది. టీడీపీ జమానాలో డెయిరీ పాలక మండలితో అంటకాగి, యాడ్స్ రూపంలో రూ.లక్షలు ఆర్జించి, వారి దోపిడీని ఏనాడూ ప్రశ్నించకుండా 'రాజ గురివింద' మొసలి కన్నీరు కార్చడాన్ని జిల్లా ప్రజలు ఛీకొడుతున్నారు.



గంగి గోవులాంటి ఒంగోలు డెయిరీకి పథకం ప్రకారం పాడె కట్టింది చంద్రబాబే..

- 'హెరిటేజ్' కోసం ఒంగోలు డెయిరీని అప్పుల ఊబిలోకి నెట్టిన వైనం
- జిల్లాలో 35 వేల మంది పాడి రైతులు హెరిటేజ్‌లోకి మారేలా కుట్ర
- మాక్స్ చట్టం నుంచి కంపెనీ యాక్టులోకి మార్చి రూ.80 కోట్లకు పైగా స్వాహా
- ఆస్తులు తనఖా పెట్టి దర్జాగా దోచేసిన టీడీపీ అనుకూల పాలక మండలి
- అప్పట్లో బాబు అధికార పర్యటనలకూ డెయిరీ నిధుల వినియోగం
- చంద్రబాబు విధ్వంసాన్ని వదిలేసి జగన్ ముంచేశాడంటూ గురివింద రాతలు



అవినీతికి మొగుడు.. డెయిరీకి యముడు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

రోజూ 2 లక్షల లీటర్ల పాల సేకరణతో నిండు కుండలా కళకళలాడుతున్న ఒంగోలు డెయిరీ చంద్రబాబు పాలనలోనే ఎందుకు కుదేలైంది? సహకార వ్యవస్థలు ఎందుకు నిర్వీర్యమయ్యాయి? ఈ ప్రశ్నలకు సమాధానం స్వార్థ ప్రయోజనాలు, అంతులేని అవినీతి. ఒంగోలు డెయిరీ పాలక మండలి 15 ఏళ్ల పాటు టీడీపీ నేతల చేతిలోనే ఉన్నా నిండా అప్పుల్లో మునిగిందంటే అర్థమేంటి? ఇవేవీ పచ్చ పత్రికకు పట్టవు. 2013లో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు ఒంగోలు డెయిరీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, ఎండీని పిలిపించుకుని డెయిరీని కంపెనీ చట్టంలోకి మార్చేలా స్కెచ్ వేశారు. పాలక మండలి సభ్యులందరూ టీడీపీ నేతలే కావడంతో ప్రకాశం జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి లిమిటెడ్‌గా ఉన్న ఒంగోలు డెయిరీ కాస్తా ప్రకాశం మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌గా మారిపోయింది. అప్పటి వరకు పాలు అమ్ముకోవడం ద్వారా వచ్చిన డబ్బును స్వాహా చేసిన టీడీపీ పాలక వర్గం డెయిరీ ఆస్తులు 104 ఎకరాలు, మిషనరీని తనఖా పెట్టేసింది. ఆ సొమ్మును డెయిరీ అభివృద్ధి పేరిట స్వాహా చేసింది. 2016–17లో రూ.7.29 కోట్ల నష్టం, 2017–18లో రూ.58.34 కోట్ల నష్టం వెరసి మొత్తం రూ.65.63 కోట్లు నష్టాలను చూపారు. భారీ నష్టాల్లో ఉందని చెప్పిన 2017–18 ఆర్థిక సంవత్సరంలో డెయిరీ ద్వారా 71.23 లక్షల లీటర్ల పాలు సేకరించారు. అంతకు ముందు ఏటా పాల సేకరణ 2 కోట్ల లీటర్లకు ఎప్పుడూ తగ్గలేదు. 2010–11లో 2.31 కోట్ల లీటర్ల పాలు, 2011–12లో 2.67 కోట్ల లీటర్ల పాలు సేకరించారు. చివరకు 2016–17లో రూ.7.29 కోట్ల నష్టం చూపించినపుడు కూడా 2.34 కోట్ల లీటర్ల పాలు సేకరించారంటే డెయిరీ పరిస్థితి బాగుందనే కదా అర్థం. కానీ పథకం ప్రకారం డెయిరీని పీకల్లోతు అప్పుల్లోకి నెట్టి, డెయిరీ నిధులు ఆస్తులు కాజేసి, జిల్లాలోని దాదాపు 35 వేల పాడి రైతులను పథకం ప్రకారం హెరిటేజ్‌లోకి మార్చడం కుట్ర కాదా?

ఆదుకున్న సీఎం వైఎస్ జగన్

- డెయిరీ బకాయిలు చెల్లించేందుకు రూ.69 కోట్లు విడుదల


ఒంగోలు డెయిరీకి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిస్థాయిలో చేయూత అందించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ప్రత్యేక జీఓ ద్వారా రూ.69 కోట్లు విడుదల చేశారు. దీంతో జీతం లేక విలవిలలాడుతున్న రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. చంద్రబాబు పాలనలో డెయిరీని మూతపడేలా చేయడంతో ఉద్యోగులకు జీతం ఇచ్చే పరిస్థితి కూడా లేదు. దీంతో డెయిరీ పాలక మండలి చైర్మన్, ఏపీడీడీసీఎఫ్ ఎండీ అన్ని రకాల బకాయిలు చెల్లించాలంటే రూ.109 కోట్లు అవసరం ఉందని ప్రభుత్వానికి 2020 డిసెంబర్‌లో లేఖ రాశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తక్షణమే బకాయిలు చెల్లించేందుకు రూ.69 కోట్లు విడుదల చేశారు. వాటిలో బ్యాంకు రుణాలు రూ.18 కోట్లు, ఏపీడీడీసీఎఫ్ రుణం రూ.20 కోట్లు, ఉద్యోగుల జీతాలు, గ్రాట్యూటీ కలిపి రూ.8 కోట్లు, పాలు సరఫరా చేసిన కొన్ని కంపెనీలకు రూ.11 కోట్లు, రిటైర్డ్, రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించిన ఇతర బకాయిలు చెల్లించేందుకు రూ.10 కోట్లు, విద్యుత్ బిల్లులు, మరికొన్ని బకాయిలకు రూ.2 కోట్లు చెల్లించారు. డెయిరీలో రెగ్యులర్ ఉద్యోగులుగా ఉన్న దాదాపు 100 మందికి వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీం(వీఆర్‌ఎస్) వర్తింపజేశారు. దీంతో వాళ్లందరికీ అన్ని రకాల ప్రయోజనాలు సమకూర్చేందుకుగాను ప్రభుత్వం ప్రత్యేకంగా అదనంగా రూ.12.26 కోట్లు ఇచ్చింది. జిల్లాలోని పాడి పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకురావడానికి, గ్రామ సీమల్లో పాడిద్వారా ఆదాయం సమకూర్చుకునే మహిళలను ఆదుకునేందుకు పాల సేకరణలో ప్రసిద్ధిగాంచిన ''అమూల్'' డెయిరీని సీఎం వైఎస్ జగన్ రంగంలోకి దించారు. జిల్లాలో పాల సేకరణను గణనీయంగా పెంచుకుంటూ పోతున్నారు. గ్రామాల్లో పాల సేకరణకు మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం అదనంగా రూ.7.74 కోట్లు అందించింది. దీంతో జిల్లాలో అమూల్ సంస్థ ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి పాడి పరిశ్రమకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు.



డెయిరీ ఆస్తులు తాకట్టు

చంద్రబాబు 2014లో గద్దెనెక్కగానే డెయిరీ ఆస్తులన్నీ తాకట్టు పెట్టడంలో ఆంతర్యమేమిటో రామోజీ విషపుత్రిక చెబితే బాగుంటుంది. డెయిరీ లాభాలు దిగమింగి, చివరకు నష్టాలు చూపిన నాటి చంద్రబాబు ప్రభుత్వం, పాలక వర్గం.. ఆదుకుంటున్నామన్న నెపంతో ఏపీడీడీసీఎఫ్‌కు డెయిరీ ఆస్తులు తాకట్టు పెట్టి రూ.35 కోట్లు అప్పు తీసుకుంది. ఈ రుణాన్ని 2018 జూన్ 27న జీఓఎంఎస్ నంబర్ 26, ఏహెచ్‌డీడీఅండ్‌ఎఫ్ కింద విడుదల చేశారు. రుణానికి తాకట్టుగా ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.58.98 కోట్ల విలువగల 8.75 ఎకరాల డెయిరీ భూమిని తనఖా పెట్టారు. దీనికి రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆయా సందర్భాల్లో ప్రకటించిన రెపో రేటు మీద 2 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన ప్రస్తుతం ఆ రుణానికి 8.25 శాతం వడ్డీ రేటు పడుతుంది. అందుకుగాను రుణాన్ని 2020 నవంబర్ నుంచి నెల వారీగా వాయిదాలు చెల్లించే విధంగా మారటోరియం విధించారు. నెలకు రూ.18 లక్షల చొప్పున 120 సమాన వాయిదాల్లో రుణం చెల్లించాల్సి ఉంది. డెయిరీ నిర్వహణతోపాటు ఉద్యోగుల జీతాలు, కరెంటు బిల్లులు, పాడి రైతులకు చెల్లింపులు, రవాణా చార్జీలు చెల్లింపులు ఇలా అన్నీ సరిచేసుకుంటూ నెలసరి వాయిదా కింద రూ.18 లక్షలు చెల్లించాలంటే డెయిరీ పూర్తి స్థాయిలో లాభాల బాట పడితే తప్ప సాధ్యం కాదు.

- ఒంగోలు డెయిరీకి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయూత
- ప్రత్యేక జీఓ ద్వారా రూ.69 కోట్లు విడుదల
- అప్పులు, ఉద్యోగుల జీతాలు, పాడి రైతుల బకాయిలు చెల్లింపు
- అమూల్ ద్వారా మళ్లీ జిల్లాలోని పాడి రైతులకు చేయూత



వచ్చే దఫా నుంచి నేను మీలో ఒకడ్ని

- ఇవే నాకు చివరి ఎన్నికలు
- రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్‌కు స్థలం కేటాయింపునకు హామీ
- భవన నిర్మాణానికి ఆర్థికంగా చేయూతనిస్తా
- రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, వేదికపై బండి శ్రీనివాసరావు, ఆల్ఫ్రెడ్, రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు

ఒంగోలు: వచ్చే దఫా నుంచి నేనూ మీలో ఒకడ్ని అని మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంఎస్ ఫంక్షన్ హాలులో రిటైర్డ్ ఉద్యోగులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ తనకు ఇంకా ఆరోగ్యం బాగానే ఉందని, తిరిగే శక్తి కూడా ఉందన్నారు. కానీ నేడు రాజకీయాల్లో విలువలు నశించాయన్నారు. గతంలో పోటీలో ఎవరున్నా ఆరోగ్యకరమైన విధానం ఉండేదన్నారు. కానీ నేడు అబద్ధాలు, నీచపు రాతలు చూస్తేనే అసహ్యం వేస్తోందని చెప్పారు. రిటైర్ అయిన తరువాత నేను కూడా మీలో ఒకడ్ని...మీ సంఘంలో నాకు కూడా సభ్యత్వం కల్పించాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనం కూడా ఒక మంచి ప్రదేశంలో ఏర్పాటుకు స్థలం కేటాయింపుతోపాటు అందుకు భవన నిర్మాణంలోను నా పాత్ర తప్పకుండా ఉంటుందన్నారు. ఆహ్లాదకరంగా ఉండేలా అన్ని వసతులు ఆ భవనంలో ఉండేలా ప్లాన్ చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతిసారి ఎన్నికల్లో తనకు ఉద్యోగుల మద్దతు ఎక్కువగా ఉంటుందని, ఈ దఫా కూడా తనను ఆదరిస్తారని ఆశిస్తున్నానన్నారు. రిటైర్డ్ పోలీసు ఉద్యోగుల స్థలం విషయం కూడా కోర్టులో ఉందని, దానిని నెరవేర్చడమా లేకుంటే దాని పక్కనే ఉన్న స్థలాన్ని కేటాయించి వారి సమస్య పరిష్కరించడమా అనేది చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ తప్పుడు ప్రచారాన్ని, అవాస్తవాలను పట్టించుకోకుండా చివరిసారిగా ఎన్నికల బరిలో దిగుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిలకు ఫ్యాన్‌గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రజల ఆకాంక్ష అన్నారు. దానిని ఎలాగైనా ఏర్పాటు చేయాలనే పట్టుదలలో బాలినేని ఉన్నారన్నారు. మరో వైపు ఇప్పటికే శంకుస్థాపన చేసుకున్న మంచినీటి పైపులైన్ల పునరుద్ధరణ పథకం మరో 9 నెలల్లో పూర్తిచేస్తారని, ఆ తరువాత తాగునీటి సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందన్నారు.

ఎన్‌జీవో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ కరోనా కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలించకే జీతాల విషయంలో సమస్య నెలకొందని, అంతే తప్ప సీఎం జగన్ ఉద్యోగులకు వ్యతిరేకం కాదని అన్నారు. చంద్రబాబుకు నిజంగా ఉద్యోగుల పట్ల చిత్తశుద్ధి ఉంటే సూపర్ సిక్స్‌లో ఉద్యోగులకు తాను ఇంత ఫిట్‌మెంట్ ఇస్తామని, సీపీఎస్ రద్దు చేస్తానని ఎందుకు ప్రకటించలేదో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు తెలుసుకోవాలని సూచించారు. సాక్షాత్తు ఏబీఎన్ రాధాకృష్ణతో కలిసి చంద్రబాబు 'ఉద్యోగులు బలిసి కొట్టుకుంటున్నారు' అంటూ చేసిన వ్యాఖ్యలను మరువరాదన్నారు. రాష్ట్రంలో మనం 7వ తేదీ కన్నా జీతాలు తీసుకుంటున్నామని, కానీ మన పక్కన ఉన్న అనేక రాష్ట్రాల్లో 15 నుంచి 20వ తేదీ వరకు పడుతున్న విషయాన్ని గమనించాలని కోరారు. సీఎం జగన్ ఉద్యోగులకు వ్యతిరేకం కాదని అన్నారు. ఉద్యోగుల పట్ల చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదన్నారు. ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ టీడీపీ మోసపూరిత మాటలు నమ్మొద్దని హెచ్చరించారు. 1986–87లో ఎన్‌టీఆర్ 7 డీఏలు ఇవ్వలేదన్నారు. సుప్రీంకోర్టు వరకు వెళ్లినా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రకారమే ప్రభుత్వం ఇస్తుందని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. 2003లో చంద్రబాబు 5 డీఏలను ఆపారని, ఆయనను అడిగితే ప్రతిపక్షంలో అయినా కూర్చుంటాగానీ డీఏలు ఇచ్చే ప్రసక్తే లేదన్న విషయాన్ని ప్రస్తావించారు. సీఎం జగన్ మాత్రం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెబుతున్నారు తప్ప ఎక్కడా ఉద్యోగుల డిమాండ్లు తప్పనిగానీ, నెరవేర్చననుగానీ చెప్పడం లేదన్నారు. ట్రాన్స్‌కో విభాగంలో ఐపీఎస్‌లు ససేమిరా అన్నా రెండు డీఏలు ఇప్పించిన ఘనత మన మాజీమంత్రి, శాసనసభ్యులు బాలినేనిదన్నారు. పోరాటం చేసే నాయకుని అవసరం మనకు ఉందని, కనుక బాలినేనిని గెలిపించుకోవడం ద్వారా మన సమస్యలను పరిష్కరించుకోవడం సాధ్యపడుతుందన్నారు. అందుకు ప్రతి రిటైర్డ్ ఉద్యోగి వైఎస్సార్‌సీపీ గెలుపులో ప్రముఖ పాత్ర పోషించాలని కోరుకుంటున్నామన్నారు. ఆత్మీయ సమావేశంలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, విశ్వరూపాచారి, అంకిరెడ్డి, కేఎల్ నరశింహారావు, ఆర్లారెడ్డి, రఘురామిరెడ్డి, తాటిపర్తి గోపాల్‌రెడ్డి, శెట్టి గోపి, నరశింహారెడ్డి, శంకరారెడ్డి, చాకిరి ధనుంజయ్, ఓబుల్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, తిరుమలశెట్టి వెంకట్రావు ఎ.రామమూర్తి, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు సమావేశానికి ముందుగా బాలినేని రిటైర్డ్ ఉద్యోగులు కూర్చున్న సీట్ల వద్దకే వెళ్లి వారిని పరామర్శించి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం, ఓటు వేయాలని అభ్యర్థించారు.



రిటైర్డ్ ఉద్యోగులను పరిచయం చేసుకుంటున్న బాలినేని

నామినేషన్ల జోరు..

- జిల్లాలో 46 మంది నామినేషన్లు దాఖలు
- పార్లమెంట్ నియోజకవర్గానికి 8 మంది నామినేషన్లు



నామినేషన్ పత్రాలు ఇస్తున్న కేపీ నాగార్జునరెడ్డి

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 46 మంది అభ్యర్థులు 48 నామినేషన్లు దాఖలు చేశారు. కొంతమంది అభ్యర్థులు ఒక్కో సెట్ నామినేషన్ వేయగా కొంతమంది రెండు సెట్ల లెక్కన నామినేషన్లు దాఖలు చేశారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రిటర్నింగ్ అధికారి వద్ద నామినేషన్లు వేసిన వారిలో స్వతంత్ర అభ్యర్థులుగా బొంత రంగారెడ్డి, జగదీష్ రాయపాటి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి ఈదా సుధాకరరెడ్డి, టీడీపీ నుంచి మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాగుంట గీతాలత, బహుజన్ సమాజ్ పార్టీ నుంచి లక్ష్మీనారాయణ ధరణికోట, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి సూర్యతేజ కోట, సమాజ్‌వాది పార్టీ నుంచి పాశం వెంకటేశ్వర్లు నామినేషన్లు దాఖలు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి యర్రగొండపాలెం అసెంబ్లీకి వైఎస్సార్ సీపీ నుంచి తాటిపర్తి చంద్రశేఖర్, స్వతంత్ర అభ్యర్థులుగా కొమ్ముల రవి, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి దూపాటి చంద్రబాబు ఉన్నారు. దర్శి అసెంబ్లీ నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా కమ్మిశెట్టి మాలకొండయ్య, మీనా మంచాలు నామినేషన్లు దాఖలు చేశారు. సంతనూతలపాడు నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థులుగా రవికుమార్ కోటి, గట్టుపల్లి గోపాలరావు, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి రాంబాబు చావాబత్తిన, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి విజేష్‌రాజ్ పాలపర్తి ఉన్నారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా దాసరి సుందరం, మన్నం సుధీర్‌కుమార్, అనిత పాలేటి, శ్రీనివాసరావు పాతపాటి, అలా నారాయణరావు, బహుజన్ సమాజ్ పార్టీ నుంచి వెంకటస్వామి తాటిపర్తి, రాకల్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి బ్రహ్మనాయుడు బిళ్లాలు నామినేషన్లు వేశారు. అదే విధంగా కొండపి అసెంబ్లీ స్వతంత్ర అభ్యర్థులుగా సుజాత విఘ్నం, యనమది వెంకటేశ్వర్లు, నాగరాజు తంగిరాల, జియా భీంరావ్ భారత్ పార్టీ నుంచి కందిపాటి వెంకటకృష్ణారావు, టీడీపీ నుంచి డోలా రాజేశ్వరి, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఉన్నారు. మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా అన్నా వెంకట రాంబాబు, స్వతంత్ర అభ్యర్థులుగా నాగార్జున రెడ్డి ఏరువ, కొత్తపల్లి బ్రహ్మరెడ్డి, కంది వెంకట నారాయణరెడ్డి, పటాన్ సుభానీ, భవనం వెంకటేశ్వర రెడ్డి, టీడీపీ నుంచి కందుల నారాయణ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. గిద్దలూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కుందురు నాగార్జున రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా తమిదల కోటేశ్వరరెడ్డి ఉన్నారు. కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ నుంచి మంజుబార్గవి దద్దాల, సమాజ్‌వాది పార్టీ నుంచి నజీర్ బాష షేక్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నుంచి చిన్న వెంకటేశ్వర్లు దమ్ము, టీడీపీ నుంచి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా చెన్నకేశవులు బోగినేని, కుర్షిద్ కస్మురి, తాతపూడి శామ్యూల్ విల్ఫ్రెడ్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.

టీడీపీ ప్రచారంలో ఉపాధ్యాయుడు



టీడీపీ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయుడు కృష్ణారావు

పామూరు: టీడీపీ కనిగిరి అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డి బుధవారం నామినేషన్ వేయనున్నారు. నామినేషన్ సన్నాహక సమావేశం మంగళవారం రాత్రి బొట్లగూడూరులోని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్ నివాసం వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి తూమాటివారిపల్లి ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు కృష్ణారావు పాల్గొన్నాడు.

ఎన్నికల నిబంధనలను అతిక్రమించిన కృష్ణారావుపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసలు



మంత్రి సురేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన మంత్రి సురేష్

పొన్నలూరు: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండలంలోని రావులకొల్లు ఎస్సీ కాలనీకి చెందిన తలారి ఇస్సాక్, కాకాని మాల్యాద్రి కుటుంబ సభ్యులు మంగళవారం టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి సురేష్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలన నచ్చే ఈరోజు ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, మాదాల శ్రీను, చిడిపోతు రమేష్, కాకాని ఏసోబు, నూకతోటి వెంకట్రావు, కర్నా మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా కమిటీల్లో పలువురు నియామకం

ఒంగోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి పార్టీ పదవులకు ఎంపిక చేశారు. రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా తాళ్లపల్లి వెలుగొండయ్య, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శులుగా ఎస్‌డీ గౌస్ మొహిద్దీన్, సౌదాగర్ రహంతుల్లాలను నియమించారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అనుబంధ విభాగాల్లో..

క్రిస్టియన్ మైనార్టీ సెల్ సంయుక్త కార్యదర్శిగా కొండపికి చెందిన చిన్నకత్తుల మంగరాజు, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా కొండపికి చెందిన కురుగంట్ల స్నేహలత, యువత విభాగం కార్యదర్శిగా దర్శికి చెందిన యన్నం కొండారెడ్డి, వైఎస్సార్ టీయూసీ ప్రధాన కార్యదర్శిగా కొండపికి చెందిన ఉప్పుటూరి వెంకట్రావు, బీసీ సెల్ కార్యదర్శిగా కొండపికి చెందిన కలికవాయి ఉమామహేశ్వర రావు, ఒంగోలు నగర ఎస్సీ సెల్ కార్యదర్శిగా జాన శ్రీనివాసులు, జిల్లా ఐటీ వింగ్ ఉపాధ్యక్షునిగా కొండపికి చెందిన బొట్ల మాల్యాద్రి, సంయుక్త కార్యదర్శిగా కొండపికి చెందిన శీలం ప్రభాకర్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా కొండపికి చెందిన కోలనేని మాలకొండయ్య, కార్యదర్శిగా కొండపికి చెందిన తేళ్ల డేవిడ్, ఎస్టీ సెల్ కార్యదర్శులుగా కొండపికి చెందిన పాలకీర్తి పోలమ్మ, కత్తి రవిలను నియమించారు.

క్లుప్తంగా

నేడు తాటిపర్తి చంద్రశేఖర్ నామినేషన్

● పాల్గొననున్న చెవిరెడ్డి, బాలినేని, ఆదిమూలపు

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం ఎమ్మెల్యే అభ్యర్థిగా తాటిపత్రి చంద్రశేఖర్ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ఉదయం 11 గంటలకు భారీ ర్యాలీ ఏర్పాటు చేశారు. నామినేషన్ కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, బూత్ కన్వీనర్లు పాల్గొని తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి కోరారు. పార్టీ శ్రేణులు భారీగా హాజరుకావాలని పెద్దదోర్నాల మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి కోరారు.

ముస్లిం కార్యకర్త జనాజా మోసిన తాటిపర్తి



జనాజా మోస్తున్న తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ కార్యకర్త బేల్దార్ ఖాశిం(ముని) మృతి చెందిన సంఘటన తెలుసుకున్న ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుడు ఖాశిం ఖనన సంస్కరణలలో ఆయన పాల్గొని ఖబరస్థాన్ వరకు జనాజా (పాడె) మోశారు.

అగ్రికల్చర్ ఉద్యోగి ఆత్మహత్య

సింగరాయకొండ (మర్రిపూడి): ఇంట్లో ఒంటరిగా ఉన్న వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ గోపవరపు వెంకట భరత్‌కుమార్‌రెడ్డి (31) బలవన్మరణానికి పాల్పడ్డాడు. భార్య చీరతో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం తెల్లవారుజామున సింగరాయకొండ మండల కేంద్రంలోని డ్రైవర్‌పేట 3వ లైనులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఒంగోలుకు చెందిన భరత్‌కుమార్ రెడ్డి ఉద్యోగ రీత్యా భార్య సాయివైష్ణవి, కుమారుడు అశ్వర్థ్ రెడ్డితో కలిసి సింగరాయకొండలో నివాసం ఉంటున్నాడు. ఇటీవల కొడుకు మూడో పుట్టినరోజు సందర్భంగా భార్యతో కలిసి అత్తగారిల్లు బేస్తవారిపేటకు వెళ్లి వేడుకలు జరుపుకుని ఒక్కడే ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం భార్య సాయివైష్ణవి ఫోన్ చేసినా.. ఎంతకూ తీయకపోవటంతో అతని తల్లి విజయలక్ష్మి ఇంటికి వచ్చి చూడగా ఉరి వేసుకుని కనిపించాడు. తన కొడుక్కి కరోనా వచ్చినప్పటి నుంచి మానసిక పరిస్థితి బాగా లేదని ఒక్కోసారి ఫోన్ స్విచ్చాఫ్ చేసి రెండు, మూడు రోజుల పాటు ఇంటి నుంచి వెళ్తుంటాడని తల్లి విజయలక్ష్మి తెలిపినట్లు పోలీసులు చెప్పారు. అయితే అతని సహ ఉద్యోగులు మాత్రం ఇతను పనిలో ఎప్పుడూ చలాకీగా ఉంటాడని, పెండింగ్ వర్క్ లేకుండా చూసుకుంటాడని చెబుతున్నారు. అనారోగ్య సమస్యల వల్లా లేక ఆర్థిక ఇబ్బందుల కారణంగానా, మరే ఇతర కారణమా అని పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించామని ఎస్సై టి. శ్రీరాం వివరించారు.

ఓటమి ఎరుగని అభివృద్ధి ప్రదాత సురేష్



మాట్లాడుతున్న పోతుల సునీత

సింగరాయకొండ(మర్రిపూడి): వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి, ఓటమి ఎరుగని అభివృద్ధి ప్రదాత రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేసి కొండపి గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని ఎమ్మెల్సీ పోతుల సునీత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కొండపిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ జగనన్న పాలనలో విద్యా, వైద్యానికి పెద్ద పీట వేశారన్నారు. పేదలకు సంక్షేమ పథకాల ద్వారా రూ. 2.77 లక్షల కోట్లు అవినీతి రహితంగా అందించారన్నారు. చంద్రబాబు తన 14 సంవత్సరాల పాలనలో రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమి లేదని చెప్పుకోదగ్గ సంక్షేమ పథకం ఒక్కటీ లేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు తన పాలనలో ఇచ్చిన 600 హామీల్లో ఒక్కటి అయినా సక్రమంగా నెరవేర్చాడా అని ప్రశ్నించారు. చంద్రబాబు పొత్తులు పెట్టుకుంటుంటే జగనన్న మాత్రం పేదలకు చేసిన మేలుతో ఒంటరిగా ఎన్నికలకు వచ్చారన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మండల అధ్యక్షుడు ఆరికట్ల కోటిలింగం, బొక్కిసం సుబ్బారావు, ఆరికట్ల హరినారాయణ, శేఖర్ రెడ్డి, వల్లంరెడ్డి రమణారెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనర్ గర్నిపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన అభిమానం

● బాలినేనికి వెంకటేశ్వర కాలనీలో అడుగడుగునా జన నీరాజనం
● మంగమ్మ కాలేజీ జంక్షన్ నుంచి వెంకటేశ్వర కాలనీ వరకు బైక్ ర్యాలీ



వెంకటేశ్వర కాలనీ రోడ్‌షోలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: బాలినేనిపై ప్రజాభిమానం ఉప్పొంగింది. నగరంలోని 50వ డివిజన్‌లోని వెంకటేశ్వర కాలనీలో మంగళవారం రాత్రి ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్‌షోకు స్థానిక మంగమ్మ కాలేజీ జంక్షన్ నుంచి వెంకటేశ్వర కాలనీ యువత ర్యాలీగా వచ్చి స్వాగతం పలికారు. మెయిన్ రోడ్డులోని అమ్మవారి ఆలయంలో బాలినేని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కాలనీలోకి ప్రవేశించారు. బాలినేని రాకతో కాలనీ మొత్తం సందడి నెలకొంది. ప్రతి ఇంటి వద్ద వాసన్న ఒక్క నిముషం అంటూ హారతులు ఇచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కొంతమంది దిష్టి తీసి వాసన్నకు జై అంటూ నినాదాలు చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ కట్టిన తరువాత ఎలా ఉందమ్మా అంటూ బాలినేని మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎంతో మేలు జరిగిందని, ఇంటి వద్దకే సంక్షేమ పథకాలన్నీ వస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. బాలినేని మాట్లాడుతూ కాలనీలో ప్రజాభిమానం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. మీకు మేలు జరగడం వల్లే ఇంత పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో లబ్ధి పొందని కుటుంబం లేదని స్పష్టం చేశారు. టీడీపీ నేతల తప్పుడు ప్రచారం నమ్మవద్దన్నారు. డివిజన్‌లో గత ప్రభుత్వంలో ఏం జరిగిందో, ఈ ప్రభుత్వంలో ఏం జరిగిందో తెలుసుకుంటే చాలన్నారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకొని మేలు చేసే వారికే ఓటేయాలని కోరారు. చివరిసారిగా ఎన్నికల బరిలో ఉంటున్నానని, తప్పక గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, డివిజన్ అధ్యక్షుడు జల్లిపల్లి ప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రజా బలంతోనే ఒంటరిగా పోటీ



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మను సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు

● చంద్రబాబును ప్రజలు నమ్మరు.. అందుకే పొత్తులు
● వైఎస్సార్ సీపీ దర్శి అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: సంక్షేమ పథకాలే జగన్‌మోహన్‌రెడ్డి బలం అని, అందుకే ఒంటరిగా పోటీకి వస్తున్నారని వైఎస్సార్ సీపీ దర్శి అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని మారెడ్డిపల్లె, చందలూరు, తుమ్మెదలపాడు, బట్టువారిపల్లె, పులిమివారిపల్లె, తుమ్మెదలపాడు గ్రామాల్లో మన ఊరు మన శివన్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఏనాడు ప్రజల గురించి పట్టించుకోలేదని, అందుకే పొత్తుల పెట్టుకొని ఎన్నికలకు వస్తున్నాడన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, అందుకే ఓటమి భయంతో ఒకటికి మూడు పార్టీలతో పొత్తు పెట్టుకుందని తెలిపారు. చందలూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని తన తండ్రి హయాంలో నిర్మించారని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే గ్రామ స్వరూపాలను మార్చేశారన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో ప్రభుత్వ సేవలన్నీ ఇంటి ముందుకే వచ్చి చేరాయని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు పేదల పాలిట వరాలుగా మారాయన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఏనాడు ప్రజల గురించి పట్టించుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని చంద్రబాబు అమలు చేయడన్న సంగతి ప్రజలందరికీ తెలుసన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తన కుమారుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీసీ నాయకుడు తమ్మిశెట్టి అచ్చయ్యకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎం బాష, పార్టీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, నెట్‌కాప్ డైరెక్టర్ సాని కొమ్ము తిరుపతిరెడ్డి, మారెడ్డిపల్లి సర్పంచ్ లింగయ్య, చందలూరు సర్పంచ్ మారెళ్ల రమణ, మాజీ ఎంపీపీ అడ్డగిరి నాగేశ్వరరావు, సర్పంచుల సంఘ అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘ అధ్యక్షుడు బండి గోపాల్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కేవీ రెడ్డి, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పాశం జై సింహారావు, కేసరి శ్రీనివాసరెడ్డి, కాసు కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగా సేవలందించే అవకాశమివ్వాలి

● వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు



వీధుల్లో ప్రచారం చేస్తున్న అన్నా రాంబాబు

పొదిలి: పవిత్ర ఓటును ఫ్యాన్ గుర్తుకు వేయటం ద్వారా నిజాయితీతో కూడిన సేవలను అందించే అవకాశం ఇవ్వాలని మార్కాపురం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అన్నా రాంబాబు అభ్యర్థించారు. మంగళవారం మండలంలోని ఓబులక్కపల్లి, మూగచింతల, కొండాయపాలెం, మాదాలవారిపాలెం గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. అన్నా రాంబాబు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకుంటే రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందన్నారు. న్యాయం కోసం అప్పటి అధికార టీడీపీకే ఎదురు తిరిగానన్నారు. కులాలను రెచ్చగొట్టటం, దౌర్జన్యాలు చేయటం ద్వారా, బెదిరింపుల ద్వారా పబ్బం గడుపుకోవాలనుకునే టీడీపీ వారికి తగు రీతిన బుద్ధి చెప్పాలన్నారు. మంచిచేస్తేనే ఓటు వేయండని ఇచ్చే జగనన్న పిలుపు గుర్తుంచుకోవాలన్నారు. ఓబులక్కపల్లిలో తాగునీటి సమస్య వెంటనే పరిష్కారం అయ్యేలా చేస్తానని, సాగునీటి కోసం వెలిగొండ ప్రాజెక్టు కాలువ పొడిగింపు విషయమై సాధ్యాసాధ్యాలను పరిశీలించి పరిష్కారం కోసం తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు, ఎంపిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అధిక మెజారిటీతో గెలిపించి మీకు సేవలు అందించే అవకాశం కల్పించాలని అన్నా రాంబాబు కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ వెలుగొండ ప్రాజక్టును పూర్తి చేసి జగనన్న జాతికి అంకితం చేసిన విషయం మర్చిపోయిన టీడీపీ నాయకులు అరిగిపోయిన రికార్డును వినిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏపీఆర్ గ్రూపు సంస్థల చైర్మన్ ఆవుల కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఓబులక్కపల్లిలో మంచినీటి సమస్యకు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలన్నారు. ఓబులక్కపల్లిలో సర్పంచ్ ఆవుల వెంకట సుబ్బారెడ్డి, వారి కుమారులు కృష్ణారెడ్డి ,చంద్ర, జయరామ్‌రెడ్డి, మూగచింతలలో సిరిమల్లె కోటేశ్వరరావు (కోటి), శేషారెడ్డి, కొండాయపాలెంలో నారాయణరెడ్డి, మాదాలవారిపాలెంలో ఆనికాళ్ల ఈశ్వరరెడ్డి, పెమ్మని ఓంకార్, గుంటూరు నాగిరెడ్డి, గుంటూరు పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు జి.చెన్నారెడ్డి, జి.శ్రీనివాసులు, కల్లం సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ కె.నరసింహారావు, మాజీ జెడ్పీటీసీ సాయి రాజేశ్వరరావు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు ఏసేబు, మందలపు శ్రీనివాసరెడ్డి, శింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, యస్థాని, హసన్‌వలి, కోగర వెంకటరావు,మల్లాపురం నరసింహులు, మాజీ ఎంపీటీసీ జూపల్లి ఏడుకొండలు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: జగనన్న పాలనలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గిద్దలూరు అభ్యర్థి, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్, అమ్మవారిశాలవీధి, పొట్టిశ్రీరాములువీధి, గణేష్‌నగర్, రాచర్లగేటు సెంటర్, కుమ్మరాంకట్టసెంటర్ ప్రధాన వీధుల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రానున్న ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కావాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలన్నారు. ప్రతి వ్యాపారస్తుడికి జగనన్న ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. గడప గడపకు ప్రభుత్వ పథకాలను చేరవేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు. జగనన్న పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, వైస్ చైర్మన్లు ఆర్‌డీ రామకృష్ణ, కాతా దీపికా, కౌన్సిలర్లు దొంతా లక్ష్మీదేవి, మానం బాలిరెడ్డి, పెద్దవలి, వైఎస్సార్ సీపీ నాయకులు చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, గుల్లా రామక్రిష్ణారెడ్డి, డాక్టర్ భూమా నరసింహారెడ్డి, కడప వంశీధరరెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు గర్రె చిరంజీవి, బాదం గోపాల్, పర్యారి నాగేశ్వరరావు, పోలేపల్లె శివ, కాపు సంఘ నాయకులు కావేటి ఈశ్వర్‌నాయుడు, ముద్దర్ల శ్రీను, జానకి రంగనాయకులు, ఓబులరావుయాదవ్, దేమా శ్రీరాములుయాదవ్, సమాదులు కాశయ్యయాదవ్, పోలెపల్లె శివ, పాలుగుళ్ల నరసింహారెడ్డి, సునీల్‌రెడ్డి, షేక్.మస్తాన్‌వలి, బాలచెన్నయ్య, బండారు నిర్మలాదేవి, బెల్లం రమాదేవి, మైనార్టీ నాయకులు గఫూర్, లతీఫ్‌ఖాన్, టైలర్‌బాష, దళిత సంఘ నాయకుడు మత్తయ్య, సూరేపల్లె రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై

టంగుటూరు: మండలంలోని కారుమంచి గ్రామానికి చెందిన బత్తుల సురేష్ తన ఇంట్లో అనుమతులు లేకుండా మద్యం పలు రకాల 180 ఎంఎల్ 25 మద్యం బాటిళ్లు నిల్వ ఉంచాడని స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని టంగుటూరు ఇన్‌చార్జి ఎస్సై వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ముద్దాయిపై కేసు నమోదు చేసి ముద్దాయిని, మద్యం బాటిళ్లను కోర్టులో హాజరు పరచునున్నట్లు ఎస్సై తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఎక్కడైనా అమ్మకాలు నిర్వహిస్తుంటే సమాచారం అందించాలి, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

కమనీయం చెన్నకేశవుని కల్యాణం



కల్యాణ తాళిబొట్టు చూపుతున్న అర్చకులు



కళ్యాణంకు హాజరైన భక్తులు

మార్కాపురం టౌన్: వేదమంత్రాలు, ముత్యాల తలంబ్రాలు, సుమంగళ వాయిద్యాలు మధ్య శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి వారి కల్యాణం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి కల్యాణం మంగళవారం వేకువజామున శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కళ్యాణ మండపంలో కమనీయంగా జరిగింది. సోమవారం రాత్రి సూర్య వాహనంపై పెళ్లి కుమారుడై శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి వారు భేరీ మండపంలో ఉండగా, అర్చకస్వాములు భేరీ పూజలు నిర్వహించారు. ఎదురుకోల అనంతరం అమ్మవారి తరపున ఆనవాయితీ ప్రకారం మండలంలోని వేములకోటకు చెందిన ఆమంచి చంద్రశేఖర్, మోహన్‌లు స్వామి వారికి తలంబ్రాలు, బియ్యం, తాళిబొట్లు, కంకణం, భటువు కళ్యాణ వస్త్రాలు సమర్పించారు.స్వామి వారి పరిణయ ఘట్టాన్ని కమనీయంగా నిర్వహిచారు. ఎమ్మెల్యే అన్నా రాంబాబు తనయుడు కృష్ణచైతన్య, మున్సిపల్ చైర్మన్ బాలమురళీ కృష్ణ, చైర్మన్ పెనుగొండ కేశవరావు, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ డైరెక్టర్ మేడా బద్రీ, ఈఓ జి. శ్రీనివాసరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ యక్కలి కాశీవిశ్వనాథం, బొగ్గరపు శేషయ్య, దంపతులు పాటు సూర్య వాహనం ఉభయదాతలుగా తంగిరాల నాగ జగన్నాథ్, కిషోర్, ఎస్ఎస్ కళాశాల చైర్మన్ నాదెళ్ల చంద్రమౌళి, ధర్మకర్తలు, పలువురు పురప్రముఖులు, అధికారులు, దంపతులు పాల్గొని స్వామి వారికి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా

● మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



ఎం. నిడమానూరులో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

టంగుటూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించి ఆశీర్వదిస్తే.. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకుపోతానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని ఎం. నిడమానూరులో పల్లె పల్లెకు సిద్ధం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలతో చరిత్రలో నిలిచిపోయే పాలన అందించారన్నారు. చంద్రబాబు హయాంలో ప్రజలకు గుర్తుండిపోయే ఒక్క పథకమైనా ప్రవేశపెట్టారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ ఎమ్మెల్యే డోలా స్వామి ప్రభుత్వ ధనాన్ని దోచుకొని తిన్నాడే తప్ప అభివృద్ధి చేయలేదన్నారు. డాక్టర్ ఆదిమూలపు సురేష్ గొప్ప విద్యావంతుడని, ఐఆర్ఎస్ అనే పెద్ద ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చారని తెలిపారు. ఒక్కసారి అవకాశం ఇస్తే.. అభివృద్ధి అంటే ఏమిట చేసి చూపిస్తారన్నారు. నియోజకవర్గ పరిశీలకులు రాచగర్ల పిచ్చయ్య యాదవ్, జెడ్పీటీసీ మన్నం అరుణకుమారి, సర్పంచి పిడుగురాళ్ల శేషమ్మ, ఎంపీటీసీ మేకం చిన్నమ్మాయి, వల్లంరెడ్డి రమణారెడ్డి, వాకా బాలకృష్ణారెడ్డి, పిడురాళ్ల స్వామినాథ్, మారెడ్డి రమణారెడ్డి, దేరపల్లి రఘువరెడ్డి, బొట్ల రామారావు, డాకా పిచ్చిరెడ్డి, మల్లవరపు కోటిరెడ్డి, రావూరి ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'నాన్నా.. లే నాన్నా'!

● కుమార్తె ఫంక్షన్ కోసం షాపింగ్ చేసి వెళుతుండగా రోడ్డు ప్రమాదం
● ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి



సంఘటన స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం రూరల్: ద్విచక్రవాహనాన్ని వెనుకవైపు నుంచి కారు ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రాయవరం మెడికల్ కళాశాల సమీపంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్ తెలిపిన వివరాల మేరకు.. కొనకనమిట్ల మండలం గుర్రాలమడుగు గ్రామానికి చెందిన బోయిన కాశయ్య (40) కుమార్తె కోసం ఓ ఫంక్షన్ చేసేందుకు కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. దీంతో కాశయ్య అతని సోదరుడు ఇద్దరూ కలిసి బుధవారం సాయంత్రం మార్కాపురంలో షాపింగ్ చేసి తిరిగి గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ సమయంలో మార్కాపురం మండలం రాయవరం మెడికల్ కాలేజీ వద్ద, మార్కాపురం నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న ఓ కారు బైక్‌ను వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో కాశయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కాశయ్య సోదరుడుకి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న మార్కాపురం అభ్యర్థి ఎమ్మెల్యే అన్నా రాంబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుమారుడిని ఓదార్చి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మరికొద్ది గంటల్లో ఇంట్లో శుభకార్యం జరగాల్సి ఉండగా ఇంతలో ఈ ఘటన జరగడంతో కాశయ్య కుటుంబంతో పాటు, గుర్రాలమడుగులో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో తమకింక దిక్కెవరంటూ భార్య, పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర నాయక్ చెప్పారు.

పెళ్లి ఖర్చులు పెడితే ఎన్నికలకోసమంటారా..

● ఎల్లో మీడియాపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ధ్వజం



కుమారుని పెళ్లిపత్రికను చూపుతున్న కృష్ణ, పక్కన సిరాజ్

మార్కాపురం: మార్కాపురంలో ఈనెల 21న తన కుమారుడి పెళ్లి రిసెప్షన్ ఖర్చుకు సంబంధించి సోమవారం కూలీలకు డబ్బులు ఇస్తుంటే దాన్ని వీడియో తీసి ఎన్నికల కోసం వార్డులో డబ్బులిస్తున్నారంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్లో ప్రచురించడంపై మున్సిపల్ విప్ కౌన్సిలర్ కొత్త కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లోమీడియాలో వచ్చిన వార్తలపై మంగళవారం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ సిరాజ్ కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ప్రజాభిమానంతో గెలిచాననీ, తన కుమారుడి పెళ్లి ఘనంగా నిర్వహించి అందుకైన ఖర్చులను కూలీలకు ఇస్తుంటే నామినేషన్ కోసం కార్యకర్తలు రావాలంటూ తాను డబ్బులిస్తున్నట్లుగా ప్రసారం చేయడం, ప్రచురించడం మంచి సాంప్రదాయం కాదన్నారు. ఈరెండు పత్రికలపై పరువునష్టం దావా వేస్తున్నానని తెలిపారు. వైఎస్సార్ సీపీకి ప్రజల్లో ఉన్న అభిమానాన్ని తట్టుకోలేక కొందరు ఇలా వీడియోలు మార్ఫింగ్ చేసి తమకు అనుకూలంగా సోషల్ మీడియాల్లో పోస్టు చేస్తున్నారని, వారిపై కూడా ఫిర్యాదు చేస్తున్నట్లు కృష్ణ తెలిపారు. ఈ రెండు పత్రికల్లో, ఛానల్స్‌లో వచ్చిన వార్తలతో శుభకార్యం జరిగిన తన ఇంట మనస్థాపంతో ఉన్నామన్నారు. ఇలాంటి వాటిని ఎల్లో మీడియాల్లో వచ్చే ఫేక్ వార్తలను ప్రజలు నమ్మవద్దని చెప్పారు. వార్తలు ప్రసారం చేసేముందు నిజాలు నిర్ధారించుకుని ప్రజలకు అందించాలని, తమకు ఇష్టం వచ్చినట్లుగా ప్రచారంచేస్తే ప్రజల్లో నమ్మకం కోల్పోతారని కృష్ణ అన్నారు.